అభివృద్ధిని చూసి అండగా నిలవండి

● న్యాయవాదులను కోరిన మంత్రి సబితారెడ్డి



న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంట ముందు వరుసలో న్యాయవాదులు ఉన్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఒక్కో న్యాయవాది కొన్ని వందల మందిని ప్రభావితం చేస్తారని, తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించి బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని న్యాయవాదులను ఆమె కోరారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని కిన్నెర గ్రాండ్ హోటల్‌లో జరిగిన మహేశ్వరం నియోజకవర్గ న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ.100 కోట్లు కేటాయించారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడే ముఖ్యమంత్రిగా అభివృద్ధి చేస్తున్నారని, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సబితారెడ్డి న్యాయవాదులను కోరారు. మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డిని గెలిపించుకుంటామని న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యులు చిలకమర్రి నరసింహ , బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, న్యాయవాదుల ప్రతినిధులు రాజిరెడ్డి ,రాజేశ్వర్ రావు,గోవర్ధన్ రెడ్డి, రంగారెడ్డి, మంత్రి రవీందర్ రావు, పులిగారి గోవర్ధన్ రెడ్డి,స్వాతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

ఊపందుకుంటున్న ప్రధాన పార్టీల ప్రచారాలు

● ఒకపక్క ఆత్మీయ సమ్మేళనాలు
● మరోపక్క ఇంటింటి ప్రచారాలు

ఎల్‌బీనగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో వారి ప్రచార రథాలకు పూజలు చేసి ప్రచారం ప్రారంభిస్తున్నారు. దీనికి తోడు ఇంటింటి ప్రచారాలు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలు, వైరి పక్షనాయకులతో రహస్య మంతనాలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఖరారు కావడంతో అన్ని పార్టీల నాయకులు సమావేశాలు, మద్దతు కూడగట్టేందుకు అసమ్మతి నేతలను మచ్చిక చేసుకుంటున్నారు.

పక్కా కార్యాచరణతో..

అభ్యర్థులు కుల సంఘాలు, మహిళా సంఘాలు, నిరుద్యోగులు తదితరులను వర్గాల వారీగా విభజించి వారితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ వారి మద్దతు కూడగట్టడంలో ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా అభ్యర్థులు అందరూ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశానంతరం వారిని మచ్చిక చేసుకునేందుకు భోజనాలు, రాత్రి అయితే వారికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు.

గల్లీ నాయకులను కలుస్తూ...

నియోజకవర్గంలో డివిజన్ల వారీగా కాలనీల్లోని గల్లీ నాయకులును కలుస్తూ వారికి తాము అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. తమకు అండగా ఉండాలని కోరుతూ ఉత్సాహంగా ఉన్నవారిని తమ వైపు తిప్పుకోవడంతో పాటు వారికి హామీలు ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ

సైదాబాద్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై సంపూర్ణ అవగాహన పెంచుకొని విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం సైదాబాద్ మాతృశ్రీ కాలనీలోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే–2023 వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ ర్యాంక్ హోల్డర్లు, క్లాస్ టాపర్లకు ఆయన గోల్డ్‌మెడల్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కేపీ శ్రీనివాస్‌రావు, సొసైటీ కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జె.సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు, అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటాచారి, సీహెచ్.రమేష్, టి.శేఖరం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మధుయాష్కీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

చైతన్యపురి: చైతన్యపురికి చెందిన పలువురు ఉద్యమకారులు, వికలాంగులు , పలు పార్టీల నాయకులు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ, గౌడ్ సమక్షంలో కాంగ్రె పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ విద్యార్థి, ఉద్యమ అమరుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో విద్యార్థులను, ఉద్యమకారులను అడుగడుగునా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో విజయ్‌మోహన్‌రెడ్డి, బి.సంతోష్‌కుమార్, రాజేష్, వెంకన్న, ప్రసాద్, కిరణ్ ప్రసాద్, అభిలాష్, రాహుల్ జైన్‌తో పాటు పలువురు మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇప్పటి వరకు రూ.3 కోట్ల విలువైన మద్యం స్వాధీనం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు, సీఐ శ్రీనివాస్ రావు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు మూడు కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని 88 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్టు చేశామని సరూర్ నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు తెలిపారు. శనివారం ఆర్‌కేపురం సరూర్ నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమన్‌గల్, షాద్‌నగర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నియమావళి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 84,440 లీటర్ల మద్యం, 75 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ దాదాపు మూడు కోట్లు ఉంటుందన్నారు. సుంకం చెల్లించని మద్యం, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే కమీషనర్ కార్యాలయానికి లేదా టోల్ ఫ్రీ నెం. 18004252523 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సరూర్ నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు

● పార్టీ అభ్యర్థి సామ రంగారెడ్డి



హస్తినాపురంలో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తోందని, దీంతో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన హస్తినాపురం డివిజన్‌లోని పోచమ్మగడ్డలో గల పోచమ్మ ఆలయంలో పూజలు చేసి ఇంటింటికీ పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గంలోని పేదలకు తీరని అన్యాయం చేశారని, రెండు పడకల ఇళ్లు, దళితబంధు, బీసీబంధు పథకాలు ఇస్తామని మాయమాటలతో ఇంతకాలం మభ్యపెట్టిన ఆయన.. ఇప్పుడు తాను గెలిచిన తర్వాత ఇస్తామని చెప్పడం మోసం కాదా అని ప్రశ్నించారు. విరాట్‌నగర్, న్యూమారుతినగర్, సాయిరాంనగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించిన ఆయన బీజేపీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విరాట్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శాంతిదేవ్‌మిత్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



కార్తీక్‌రెడ్డి, శ్యాంసుదర్‌గుప్తా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో యువత ఎక్కువగా చేరుతున్నారని ఆ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ బీజేవైఎం సెక్రటరీ చింటూ యాదవ్, బీజేవైఎం నాయకులు నరేష్, మల్లేష్‌లు డివిజన్ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులకు బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ గుప్తా మాట్లాడుతూ, రెండు మూడు రోజుల్లో ఆర్కేపురం డివిజన్ నుంచి బీఆర్‌ఎస్‌లో భారీ చేరికలు ఉంటాయన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్తామని అన్నారు. బీజేపీ నుంచి 50 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారని తెలిపారు.

ఎల్‌బీనగర్‌లో 2 నామినేషన్లు దాఖలు



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీజేపి అభ్యర్థి సామ రంగారెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు శనివారం ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి సతీమణి అలివేలుతో ఎటువంటి ఆర్భాటం లేకుండా వచ్చి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిణి ఎస్.పంకజకు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సపావత్ సుమన్ నామినేషన్ వేశారు. ఇప్పటి వరకు మొత్తం 33 మంది నామినేషన్ పత్రాలు తీసుకెళ్లారని, నలుగురు మాత్రమే నామినేషన్లు సమర్పించారని ఆర్‌ఓ ఎస్.పంకజ తెలిపారు.

యాకుత్‌పురాలో రెండు..

సైదాబాద్: యాకత్‌పురా నియోజకవర్గానికి సంబంధించి శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల మొదటిరోజైన శుక్రవారం ఎవరూ నామినేషన్లు వేయలేదు. రెండవ రోజు శనివారం ఇద్దరు వేశారు. చంపాపేటలోని సైదాబాద్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన యాకుత్‌పురా నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో యాకుత్‌పురాకు చెందిన ఎండీ అక్రం అలీ ఖాన్, సైదాబాద్ ధోబీఘాట్‌కు చెందిన ఎ.సరిత ఇండిపెండెంట్లుగా నామినేషన్‌లు వేశారు.

మలక్‌పేటలో రెండు..

చాదర్‌ఘాట్: మలక్‌పేట శాసన సభా నియోజకవర్గంలో పోటీ చేసేందుకు శనివారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. బీఎస్‌పీ నుంచి ఎ.రమేష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా శంకర్‌నగర్‌కు చెందిన సయ్యద్ బిలాల్ నామినేషన్ వేశారని చెప్పారు.

అభివృద్ధి చూసిన మరోసారి గెలిపించండి

● బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



కేటీఆర్, సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు రాఘవ చారి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నదని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. శనివారం నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మల్లేష్, సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, ఉద్యమకారులు సతీష్ యాదవ్, సుర్వి రాజు, కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌లో..

కొత్తపేట డివిజన్ శివశంకర్ కాలనీలో శనివారం ఎల్‌బీనగర్ సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గుర్తించి ఆయన వివరించారు.కొత్తపేట మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత రాఘవచారి

తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, గతంలో చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్‌గా పోటీ చేసిన వింజామూరి రాఘవచారి, అతని అనుచరులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కవిత, చెన్నూ, భాస్కర్, లలిత, రజిత, వెంకట చారి, విష్ణు పాల్గొన్నారు.

ముస్లింల చేరిక...

చంపాపేట ముస్లిం బస్తీకి చెందిన మహమ్మద్ సలీంతో పాటు పలువురు ముస్లింలు శనివారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

‘అభివృద్ధి’పై గడప గడపకూ ప్రచారం

మన్సూరాబాద్: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిల ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు ప్రచారం చేశారు. మన్సూరాబాద్ చౌరస్తాలోని ఆంజనేయ ఆలయంలో పూజలు నిర్వహించి వీకర్ సెక్షన్ కాలనీ, హిమపురి కాలనీ , బాల్‌రెడ్డి నగర్, చండీశ్వరీ కాలనీ, శైలజాపురి కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు పురుషోత్తంరెడ్డి, అరవింద్ రెడ్డి, ఈశ్వరమ్మయాదవ్, జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్రయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఆర్‌కు మద్దతుగా ప్రచారం



ఆర్‌కేపురంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న పున్న గణేష్, చిలక ఉపేందర్‌రెడ్డి


దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. రామకృష్ణపురం డివిజన్‌లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శాసన సభ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి (కేఎల్‌ఆర్)కు మద్దతుగా టెలిఫోన్ కాలనీ, మార్గదర్శి కాలనీల్లో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, పెద్దపూర సైదులు, శివ, పగడాల శ్రీశైలం, వంగాల శ్రీకాంత్ రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, కళ్యాణ్, రాజు నాయక్, మణికంఠ, వెలిజాల శివ పాల్గొన్నారు.

ఎంఐఎం కార్పొరేటర్, కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు నమోదు

చంచల్‌గూడ: మలక్‌పేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పోటీ భౌతిక దాడుల వరకు వెళ్లింది. దాడులకు సంబంధించి ఇరువర్గాల వారు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. ఎంఐఎం కార్పొరేటర్ సలామ్ షాహిద్, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌లపై శనివారం మాదన్నపేట పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.... మలక్‌పేట అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ మత పెద్దలను, పరిచయస్తులను మర్యాద పూర్వకంగా కలిసేందుకు శుక్రవారం చావణీ డివిజన్ పరిధిలోని అయాబీ మసీదు వద్దకు వెళ్లాడు. ఇది గమనించిన ఎంఐఎం నేతలు, కార్యకర్తలు అడ్డగించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తనతో పాటు అనుచరులపై ఎంఐఎం కార్పొరేటర్ సలామ్ షాహిద్ మరికొందరు దాడి చేశారని షేక్ అక్బర్ సౌత్‌ఈస్ట్ డీసీపీకి కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఎన్నికల ప్రచార సమయంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో కోరాడు. కాగా షేక్ అక్బర్ ప్రార్థన స్థలం వద్దకు చేరుకుని తనకు ఓటు వేయాలని మసీదుకు వచ్చే వారిని బలవంతం చేస్తున్నాడని నిజాముద్దీన్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదులను పరిశీలించిన పోలీసులు ఎంఐఎం కార్పొరేటర్ సలామ్ షాహిద్, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మలక్‌పేట: జీవితంలో ఒడిదొడుకులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడాలని పవర్ మేక్ పౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సజ్జా లక్ష్మి అన్నారు. నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ వారు పవర్ మేక్ ఫౌండేషన్ సహకారంతో మలక్‌పేట, అంబర్‌పేట కేంద్రాలలో 45 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సకలాంగులైన 35 మందికి సర్టిఫికెట్లు, జీవనోపాధి కోసం కట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ వెంకటరావు, సొసైటీ చైర్మన్ దంతురి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళలకు గోమయ దీపాల తయారీపై శిక్షణ



గోమయ దీపాల తయారీ అవగాహన సదుస్సులో పాల్గొన్న మహిళలు


నాగోలు: దీపావళి సందర్భంగా నాగోలు డివిజన్ బండ్లగూడలోని ఇంద్రప్రస్థ కాలనీలో గాంధీ చిల్డ్రన్ పార్క్‌లో శనివారం ఇంపాక్ట్ హబ్ హైదరాబాద్ సంస్థ, కాలనీ వాసి లయ కాలంశెట్టి ఆధ్వర్యంలో గోమయంతో దీపాల తయారీ, గోమయ పుష్పం విధానంపై మహిళలకు అవగాహన, ఉచితంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంపాక్ట్ హబ్ హైదరాబాద్ నిర్వాహకురాలు వర్తకవి కరుణ గోపాల్ మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి రంగాలలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా దీపావళి సందర్భంగా అందరూ ఉపయోగించే దీపంతులు గోమయంతో తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం గోమయం ముడి పదార్థాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జ్యోత్స్న ప్రవీణ, రాధిక, రోహిణి, ఇంద్రప్రస్థ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

‘విశ్వబ్రాహ్మణ’సభను విజయవంతం చేయండి

చైతన్యపురి: ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన స్థలంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన బహిరంగ సభను విజయవంతం చేయాలని మహాసభ కార్యదర్శి కీర్తిగారి అనంతాచారి అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకార వీధిలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్ మార్కెట్ నుంచి భారీ బైక్ ర్యాలీగా ఉప్పల్ భగాయత్‌కు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు రవిచారి, కిష్టాపురం రవిచారి, గోవర్ధన్‌చారి, చెన్నోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

● మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్



మూసారంబాగ్‌లో పర్యటిస్తున్న అక్బర్, విజయసింహారెడ్డి

మలక్‌పేట: ప్రజాపాలన అందించే కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆపార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శనివారం మూసారంబాగ్‌లో పర్యటించారు. శాలివాహననగర్, వడ్డెర బస్తీల్లో తిరిగి కాలనీవాసులను స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకులు ప్రజా సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. అన్ని వర్గాలకు అభ్యున్నతికై కృషి చేస్తానని, ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు మండడి విజయసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, పోలం రవీందర్‌యాదవ్, బద్దం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి చదువుకు రూ.40 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని బొల్లారానికి చెందిన వి.లక్ష్మీనారాయణ– రేణుక దంపతులు ఓ అనాథ విద్యార్థి చదువుకు రూ.40 వేలు విరాళంగా అందజేశారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం విద్యార్థి పొన్నం ప్రణీత్ ఎంబీఏ చదువుకు వారు శనివారం విరాళం డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, దేశంలో ప్రతిష్టాత్మక (ఐసీఎఫ్ఐఏ) ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్స్ ఆఫ్ ఇండియా, బెంగళూరు క్యాంపస్‌లో అఖిల భారత ఎంట్రన్స్ ద్వారా ప్రణీత్ సీటు సాధించాడన్నారు. అక్కడ హాస్టల్ ఫీజు కోసం అతడికి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ విజ్ఞప్తి మేరకు విరాళాన్ని అందజేశామన్నారు.

